క్లుప్తంగా

రాత పుస్తకాల వితరణ



కొత్తకోట రూరల్: మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 90 మంది విద్యార్థులకు తెలంగాణ ఉద్యమకారుడు టీజీ మహేష్ రాతపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా తాను వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యుగంధర్‌రెడ్డి, బీఎస్పీ నాయకులు మాసన్న, భరత్‌యాదవ్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ప్రభుత్వం చేయూత

మదనాపురం: మండలంలోని తిర్మలాయపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం రాతపుస్తకాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం లక్ష్మయ్య మాట్లాడుతూ.. పేద పిల్లలకోసంఅనేక విధాలుగా చేయుతనిస్తుందని దీనిని ప్రతిపేద విద్యార్థి సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వృక్షాలే జీవనాధారం



ఆత్మకూర్: వృక్షాలే జీవనాధారమని స్వచ్ఛమైన గాలితోపాటు పర్యావరణం కలుగుతుందని, సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. శుక్రవారం పురపాలిక కార్యాలంలో వార్డుల అధికారులు, కార్మికులతో కలసి మొక్కలను నాటారు. వన మహోత్సవంలో భాగంగా పట్టణంలో అందరు కలసికట్టుగా మొక్కలను నాటాలని, వృక్షాలుగా ఎదిగేంతవరకు సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డుల అధికారులు ఝాన్సీరెడ్డి, అనూష, మోహన్, కాశన్న తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ఖిల్లాఘనపురం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని హెచ్‌ఎం కాళిదాస్, నాయకులు జయాకర్ అన్నారు. శుక్రవారం మండలంలో బాలుర ఉన్నత పాఠశాల , ఆగారం గ్రామంలోని రోడ్లకు ఇరువైపులా వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మొక్కలు నాటడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కార్యదర్శి రవికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్,, మంజుల పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఖిల్లాఘనపురం: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇంచార్జి ఏఈ సుధాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయిన్‌టెనేన్స్ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా 32కేవీ ఖిల్లాఘనపురం, 32 కేవీ సోలీపురం, 32 కేవీ కమాలొద్దీన్‌పూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఈ సమయంలో రైతులు, ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పాన్‌గల్: భూ వివాదంలో ఘర్షణ పడిన ఇరు వర్గాలపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు. హెచ్‌సీ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తెల్లరాళ్ళపల్లితండాకు చెందిన కేతావత్ రాజు, కేతావత్ ఆంజనేయలు వ్యవసాయ భూమి విషయంలో ఇద్దరు ఈనెల 17వ తేదీన తండాలో ఘర్షణ పడ్డారు. భూ వివాదం కక్ష్యలను మనుసులో పెట్టుకొని కేతావత్ రాజు, అతని భార్య చిట్టెమ్మలను దూషించి రాయితో దాడి చేసి గాయపర్చారని కేతావత్ ఆంజనేయులుపై, కేతావత్ ఆంజనేయులు, తల్లి నానమ్మలను దూషించి రాయితో దాడి చేసి గాయపర్చారని కేతావత్ రాజుపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

ఆశ.. నిరాశే..!



సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు (ఫైల్)

- వేతనాల పెంపు హామీ మరిచారు
- ఉద్యోగ భద్రతపై ఆందోళన
- డిమాండ్ల సాధనకు సిద్ధమవుతున్న వర్కర్లు

మదనాపురం: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తున్న ఆశ కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నది. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వారిని విస్మరించింది. 'ఏరు దాటే దాక ఓడ మల్లన్న.. తరువాత బోడమల్లన్న' అన్న చందంగా సర్కారు తీరు కనిపిస్తున్నదని ఆశ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రమకు తగ్గట్టుగా రూ.18వేల వేతనం ఇస్తామని ఉద్యోగభద్రత ఎన్నికల కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీల ఊసే ఎత్తడం లేదని వాపోతున్నారు. అటు వైద్యారోగ్య ఉన్నతాధికారులు సమస్యలను పట్టించుకోవడం లేదు. ఈ విషయమై డిమాండ్ల సాధనకోసం ఉద్యమించడానికి ఆశ కార్యకర్తలు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో 510 మంది ఆశవర్కర్లు

జిల్లాలో 14 మండలాల్లో మొత్తం 557 మంది ఆశవర్కర్లు పని చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఏఎన్‌ఎంలకు అనుబంధంగా ఉంటూ సేవలు అందిస్తున్నారు. వైద్యఆరోగ్యశాఖ పరంగా అందుబాటులో ఉంటూ గర్భిణులకు ఇబ్బంది ఏర్పడిన కాన్పుల కోసం మహిళలకు ఆరోగ్యపరంగా ఇబ్బంది వచ్చిన వెంట ఉంటూ తమ కుటుంబాలకు సైతం పక్కన బెట్టి రేయింబవళ్లు ఆసుపత్రికి తీసుకెళ్తారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతల మహిళలను పర్యవేక్షించడంతో పాటు ఎప్పటికప్పుడు అధికారులకు నివేదిక సమర్పిస్తారు. ప్రభుత్వం ఇచ్చే రూ.9,600తో తమ కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని పలువురు ఆశ కార్యకర్తలు చెబుతున్నారు. ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.18వేలు ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపించాం

ఆశ వర్కర్ల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం. జిల్లాలో 557 మంది విధులు నిర్వహిస్తున్నారు. వేతనాల పెంపు విషయం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. మా పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తాం.

– శ్రీనివాసులు జిల్లా వైద్యాధికారి వనపర్తి

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విధంగా ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి. కుటుంబాలు గడవడం కష్టంగా ఉంది. వచ్చిన వేతనంతో పిల్లల చదువులు సంసారం గడవదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.

– కె.సునీత, ఆశవర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు

మహిళలకు అందుబాటులో ఉంటాం



ఆరోగ్యపరంగా గర్భిణులతో పాటు బాలింతలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా ఎప్పటికప్పుడు మేము పర్యవేక్షిస్తూ సేవలు చేస్తాం. వారి ఆరోగ్య పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తాం. మాకు చాలిచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నాం.

– బుచ్చమ్మ ఆశ వర్కర్

మరో ఆందోళనకు సిద్ధం



ఆశ వర్కర్ల వేతనాలు పెంచకుంటే రాష్ట్ర వ్యాప్తంగా మరో ఆందోళనకు శ్రీకారం చుడతాం. ప్రభుత్వం 18నెలలుగా కాలయాపన చేసింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కచ్చితంగా నిల బెట్టుకోవాలి.

-బొబ్బిలి నిక్సన్
సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి



పిన్నంచర్లలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ఫయాజ్



మురుగు, చెత్తను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న కార్మికులు

ఆత్మకూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కాచి వడబోసిన నీటినే తాగాలని దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తిప్పడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఫయాజ్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం మండలంలోని పిన్నంచర్ల గ్రామంలో వైద్యులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సరిత, ఆరోగ్య పర్యవేక్షకుడు సురేందర్‌గౌడ్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం..

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని దోమలువ్యాప్తి చెందకుండా జాగ్రత్తలను తీసుకుని రోగాలను తరిమెయ్యాలని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఒకటోవార్డు ఖానాపూర్‌లో సిబ్బందితో కలిసి ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డుల అధికారులు, పురపాలిక సిబ్బంది ఉన్నారు.

నిల్వనీటితో వ్యాధులు ప్రబలుతాయి

వనపర్తిటౌన్: నిల్వనీటిని వాడితే సీజనల్ వ్యాధుల బారినపడి అనారోగ్యం పాలవుతారని, ప్రజలు నిల్వనీరు ఉంచకుండా డ్రమ్ములను, బిందెలను, ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఫ్రైడే–డ్రైడే నిర్వహించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఆయావార్డుల్లో నిల్వనీటిని కిందపారబోసి, సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా, తడి, పొడి చెత్త విభజనపై అవగాహన, వీధి, పెంపుడు కుక్కలపై ఏబీసీ ప్రచారం, డ్రైనేజీల్లో మురుగును తీయించే పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, డీఎంసీ బాలరాజు, సూపర్‌వైజర్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి హర్షిత తెలిపారు. శుక్రవారం ఎస్‌సీ హాస్టల్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హాస్టల్‌లో ఉన్న కొంత మంది విద్యార్థులు తరుచుగా వచ్చే జలుబు, దగ్గు, జ్వరం, దురద తదితర సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, టీకాలు ఉచితంగా ఇవ్వడం జరిగిందని చెప్పారు. వర్షాకాలం కాబట్టి విద్యార్థులు కచ్చితంగా శుభ్రత పాటించాలన్నారు. అందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వార్డెన్ రవికుమార్, ఆశకార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరచింత: పరిసరాల శుభ్రతలో ప్రజలు భాగస్వామ్యం కావాలని, ప్లాస్టిక్‌ను నిత్యం వాడుకోవడం ద్వారా ప్రమాదకరమైన వ్యాధులకు గురవుతారని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలో శుక్రవారం 3వవార్డులో ప్రజలకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. వార్డు అధికారులు, మెప్మాసిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఇమామే మౌలాలి గంధోత్సవం



కొడిపీర్లవద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూర్: పట్టణంలోని రాజవీధిలోని మసీదులో ప్రతిష్టించిన కొడిపీర్ల ఉత్సవాలు ముమ్మరంగా సాగుతున్నాయి. శుక్రవారం రాత్రి మౌలాలి గంధోత్సవాన్ని గౌస్‌సాహేబ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, కందూర్లు నిర్వహించి రాత్రి 1 గంటలకు పట్టణంలోని పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో పీర్లను ఊరేగించారు. శనివారం సాయంత్రం హుస్సేనేఆలం, ఇమామేఖాసిం, ఇమామే జలాలీ పీర్లను భక్తులు ప్రత్యేకపూజల అనంతరం ఊరేగింపు నిర్వహిస్తారని తెలిపారు. ఊరేగింపు చూసేందుకు పట్టణంతో పాటు ఇతర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లను చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆరోపణలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: మక్తల్ నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర పశువర్ధక, మత్స్య, యువజన, క్రీడలశాఖల మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ముందుకెళ్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు రహెమతుల్లా, పరమేశ్, తులసిరాజ్, శ్రీనివాస్‌లు అన్నారు. శుక్రవారం స్థానిక అతిథి గృహంవద్ద విలేకరులతో మాట్లాడారు. పదేళ్లపాటు ఎమ్మెల్యేగా కొనసాగిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతోనే ఎన్నికల్లో ప్రజలు ఓడగొట్టారన్నారు. కాంగ్రెస్ నుంచి గెలుపొంది బీఆర్‌ఎస్‌లో చేరారని హస్తం పార్టీని నిందించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎలాంటి అభివృద్ధిని చేయలేక జనం ఎక్కడ ప్రశ్నిస్తారోనని మంత్రి వాకిటి చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలందరూ తమవైపునే ఉన్నారని, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాచాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డంశ్రీనివాస్, మణివర్ధన్‌రెడ్డి, దామోదర్, నాగేష్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలి



పాన్‌గల్: మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకుంటే బిల్లులు త్వరగా అందుతాయని ఎంపీడీఓ గోవిందరావు అన్నారు. శుక్రవారం మండలంలోని మాధరావుపల్లి గ్రామాన్ని సందర్శించి ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి మొత్తం 57 ఇళ్లు మంజూరు కాగా అందులో 36ఇళ్లకు మార్కింగ్ ఇవ్వగా అందులో ఇప్పటివరకు స్లాబ్‌వరకు 13 ఇళ్లు పూర్తయిందని ఆయన పేర్కొన్నారు. మిగతా లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలన్నారు. ఆయన వెంట ఏపీఓ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

అమరచింత: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు కోరారు. పట్టణంలో పలువార్డుల్లో శుక్రవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి త్వరగా ప్రారంభించాలని ఆయన తెలిపారు. 54 ఇళ్లు మంజూరయ్యాయని కేవలం 20 మంది బేస్‌మెంట్ పనులు చేపడుతున్నారన్నారు. గడువులోగా ఇంటి నిర్మాణ పనులు చేపట్టకపోతే మంజూరు పత్రం రద్దు చేసి ఇతరులకు ఇచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యూసుఫ్ పాల్గొన్నారు.

ఎస్సీల స్థలాలపై మందకృష్ణకు ఫిర్యాదు

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ గ్రామంలో ఎస్సీలకు కేటాయించిన ఇళ్లస్థలాలు, డబుల్‌బెడ్రూం కేటాయింపుపై గ్రామానికి చెందిన కొందరు మందకృష్ణకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను కలిసి గ్రామానికి చెందిన ఎస్సీ నాయకులు ప్రేమ్‌కుమార్, మహేష్, యోగానందం, పరుశరాం తదితరులు కలిసి పలు విషయాలను వివరించారన్నారు. ఎస్సీలకు కేటాయించిన భూమి సర్వేనంబర్ల మార్పు, నిర్మిస్తున్న డబుల్‌బెడ్రూం ఇళ్ల కేటాయింపులో వివక్షత, కొందరి నాయకుల అక్రమ వ్యవహారాలపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల పేరుతో డబ్బులు వసూలు చేసిన విషయం, ఇళ్ల కోసం కేటాయించిన భూమికి హద్దులు ఏర్పాటు చేసి స్థలాల పంపిణీ తదితర విషయాలపై ఫిర్యాదు చేశారన్నారు.

రామన్‌పాడులో పెరిగిన నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం సముద్ర మట్టానికి పైన 1,020 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 1,250 క్యూసెక్కులు, సమాంతర కాల్వ నుంచి 665 క్యూసెక్కుల జలాశయానికి కొనసాగుతుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 905 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 76 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 873 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు వివరించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి



నిల్వనీటిని పరిశీలిస్తున్న వైద్యుడు చంద్రశేఖర్

పాన్‌గల్: ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంటేనే రోగాలకు దూరంగా ఉండారని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. డ్రైడే ఫ్రైడేలో భాగంగా శుక్రవారం మండలంలోని జమ్మాపూర్ గ్రామంలో వైద్యసిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వారానికి ఒక్కసారి నిల్వనీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సుమనశ్రీ, రాంచందర్, సతీష్, రమాదేవి, శైలాజ, పంచాయితీ కార్యదర్శి ఉసేనయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న రాజ్‌కుమార్

అమరచింత: సైబర్‌నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంఎస్‌ఎంఈ కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ అన్నారు. అమరచింత చేనేత ఉత్పత్తుల సంఘంలో శుక్రవారం చేనేత కార్మికులకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మారుతున్న కాలంలో సాంకేతికను ఉపయోగించుకుని పలువురు చెడుమార్గాల వైపు వెళ్తున్నారని, అప్పనంగా డబ్బులు సంపాదించుకునే ఆలోచనలతో ఇతరులను మోసం చేయ్యడానికి వెనకాడరన్నారు. మొబైల్‌ఫోన్‌లో వచ్చిన మెసేజీలకు రిప్లై ఇవ్వరాదన్నారు. ఎవరైనా తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి మీరు నగదు గెలుచుకున్నారని, మీ ఆధార్, బ్యాంక్ అకౌంట్ నంబర్‌లతో పాటు ఓటీపీని చెప్పమని అడిగితే చెప్పరాదన్నారు. సైబర్‌నేరాలు ఎలా జరుగుతున్నాయి, ఎలా మోసపోతున్నారు అన్న విషయాలను ప్రొజెక్టర్ ద్వారా డెమో ఇచ్చారు. సమావేశంలో మధు, అమరచింత చేనేత ఉత్పత్తుల సంఘం సీఈఓ చంద్రశేఖర్, వెంకటస్వామి, ఆశోక్, భాగ్యమ్మ పాల్గొన్నారు.

మనకాలపు మహాత్ముడు మండేలా



మండేలా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవులు, నాయకులు

వనపర్తిటౌన్: మనకాలపు మహాత్ముడు మండేలా అని, జాతి వివక్షతకు ఉద్యమబాటలు వేసిన నెల్సన్ మండేలా జీవితం ప్రపంచానికి ఆదర్శప్రాయమని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారాం ప్రకాష్ అన్నారు. మండేలా 107వ జయంతి వేడుకలను మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, వ్యాఖ్యాత డాక్టర్ నాయికంటి నరసింహశర్మ, కురుమయ్య, ధర్మ టీచర్స్ యూనియన్ నాయకుడు ఆది, వెంకటేష్, ముదిరాజ్ సంఘం నాయకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష పార్టీల నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు

వీపనగండ్ల: జటప్రోల్ పట్టణంలో శుక్రవారం జరిగిన సీఎం పర్యటన సంబంధించి మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ప్రతిపక్ష పార్టీల నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలతోపాటు పలువురు ప్రజాసంఘాల నాయకులను శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా అదుపులోకి తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. అదుపులో ఉన్నవారిలో బీఆర్‌ఎస్ నాయకులు ముంత మల్లయ్యయాదవ్, శివ, బీజేపీ మండలకార్యదర్శి నారాయణ, పలువురు కార్యకర్తలు ఉన్నారు.

సీఎం సభకు భారీగా తరలిన మహిళలు



పాన్‌గల్ నుంచి కొల్లాపూర్‌కు తరలివెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు



సంగినేనిపల్లి నుంచి సభకు వెళ్తున్న కార్యకర్తలు

వీపనగండ్ల: ఉమ్మడి మండలంలోని జటప్రోల్ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి సమావేశానికి మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లోని మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు భారీగా తరలివెళ్లారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని మహిళా సాధికారిత కోసం ప్రభుత్వం మహిళలకు ఎంతో చేయూతనందిస్తుందని జిల్లా మహిళా సమైక్య కోశాధికారి ఎత్తం చిట్టెమ్మ అన్నారు. తరలి వెల్లిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీరయ్య యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు నారాయణ రెడ్డి, ఇంద్రకంటి వెంకటేష్, చిన్నారెడ్డి, సుదర్శన్ రెడ్డి, చక్ర వెంకటేశ్, బాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గోపి, కావలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

పాన్‌గల్: కొల్లాపూర్‌లో నిర్వహించే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగసభకు మండలకేంద్రం పాన్‌గల్‌తో పాటు 28 గ్రామ పంచాయతీల నుంచి కాంగ్రెస్ శ్రేణులు, మహిళ సంఘాల సభ్యులు శుక్రవారం తరలివెళ్లారు. మండలం నుంచి దాదాపుగా 100 ఆర్టీసీ బస్సుల నుంచి కాంగ్రెస్ శ్రేణులు, మహిళ సంఘాల సభ్యులు తరలివెళ్లారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, మండలపార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు సురేఖయాదవ్, మండల కాంగ్రెస్ నాయకులు రవికుమార్, రాముయాదవ్, వెంకటేష్‌నాయుడు, పుల్లారావు, బ్రహ్మయ్య, నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

నీటి వృథాను అరికట్టరూ...

అమరచింత: పట్టణంలోని దశమికట్ట వద్ద ఉన్న మిషన్ భగీరథ వాటర్‌ట్యాంక్ ద్వారా ఎప్పుడు పడితే అప్పుడు ట్యాంకు నిండుకుని నీరు వృథాగా పారటం పరిపాటిగా మారింది. మంచినీరు గంటల తరబడి మంచినీరు పోతుండడంతో మరికల్–ఆత్మకూర్ ప్రధాన రహదారి మిషన్ భగీరథ నీటితో నిండుకుంటూ రహదారి గుంతలమయంగా మారుతోంది. భగీరథ ద్వారా వాటర్ ట్యాంకులకు నీటిని మళ్లించే సిబ్బంది సమస్య తమదికాదని దాటెయ్యడం, మున్సిపల్ వాటర్ మెన్‌లు సైతం సమస్య తమది కాదని మిన్నకుండటంతో నీటివృథాను అరికట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.



వాటర్‌ట్యాంకు నుంచి నీరు పారుతున్న దృశ్యం